# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

ఆదివారం 12, ఏప్రిల్ 2026






## ప్రమాదవశాత్తు ఆశ్రమ పాఠశాల విద్యార్థి మృతి



**జైనూర్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:**

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని పానపటార్ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన నాలుగో తరగతి విద్యార్థి దుర్వా అన్వేష్ (10) ప్రమాదవశాత్తు మృతి చెందిన సంఘటప చోటు చేసుకుంది. క్లస్టర్ ఏటీడీఓ శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధరా సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. వసతి గృహంలో విద్యార్థులు నిద్రిస్తున్న బెడ్డుకు ఉయ్యాల కట్టుకొని ఆడుతుండగా శుక్రవారం సాయంత్రం అన్వేష్ కిందపడ్డారు. ఆ గదిలో ఉన్న బాక్స్ తలకు బలంగా తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే జైనూర్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యాధికారి అశోక్ ధ్రువీకరించారు. విషయం తెలియగానే మాజీ గ్రంథాలయ చైర్మన్ కనకయ్య యాదవ్, ఆదివాసీ నాయకులు ఆసుపత్రికి చేరుకున్నారు. విద్యార్థి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ, బాధిత కుటుంబానికి ఐటీడీఏ పరంగా రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ఏటీడీఓ శ్రీనివాస్ స్పందిస్తూ.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు పానపటార్ సర్పంచ్ ఆత్రం తులసి శంకర్, మృతి చెందిన విద్యార్థి తండ్రి, బంధువులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. జైనూర్ ఎస్సై రవికుమార్ ఆసుపత్రికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును బంధువులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఎస్సైకు హెచ్ఎంలు ధరా సింగ్, భీంరావు వివరాలను వివరించారు.

### జ్యోతిరావుపూలే ఆశయ సాధన కోసం

## కలిసికట్టుగా పనిచేయాలి

✳ ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ ✳ సీఆర్‌నగర్‌లో ఘనంగా జ్యోతిరావుపూలే జయంతి వేడుకలు



**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త :**

జ్యోతిరావు పూలే సమానత్వం, స్త్రీ విద్య, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప యోధుడని, జ్యోతిరావుపూలే ఆశయ సాధన కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. సామాజిక సమానత్వానికి పునాదులు వేసిన మహోనీయుడు మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు శనివారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం సీఆర్ నగర్‌లో మిగతా 2లో..

### కాసిపేట్ మండలంలో

## పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్

● వాహనాల తనిఖీలు, గుడుంబా ధ్వంసం



**బెల్లంపల్లి, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**

రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ ఆదేశాల మేరకు, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ మార్గదర్శకత్వంలో, మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ రమేష్ ఆధ్వర్యంలో శనివారం రోజున ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు కాసిపేట్ మండలంలోని లంబాడి తండాడి గ్రామం, దేవాపూర్, కాసిపేట్, రామకృష్ణాపూర్ ప్రాంతాల్లో విస్తృతంగా కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ (కార్డన్ అండ్ సెర్చ్) నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించి, పరిసర ప్రాంతాల్లో ఎవరైనా అపరిచితులకు ఆశ్రయం కల్పిస్తున్నారా అనే కోణంలో విచారణ చేపట్టారు. ప్రతి ఒక్కరి ఆధార్ కార్డ్ సహా ఇతర గుర్తింపు పత్రాలను పరిశీలించారు. అదేవిధంగా ద్విచక్ర వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, ఆర్‌సీ, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ వంటి పత్రాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని మరియు నెంబర్ ప్లేట్లు లేని 43 ద్విచక్ర వాహనాలను గుర్తించి అక్కడికక్కడే జరిమానాలు విధించి సరిచేయించారు. నెంబర్ ప్లేట్లు లేని మరో 2 వాహనాలను సీజ్ చేశారు. అలాగే అక్రమంగా తయారు చేస్తున్న సుమారు మిగతా 2లో..

## పేదింటి ఆడపడుచులకు అండగా కాంగ్రెస్ సర్కార్

■ గ్రామాల అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యులు కావాలి

■ బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి

**వేమనపల్లి, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**

బెల్లంపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి పేర్కొన్నారు. శనివారం వేమనపల్లి మండలంలోనీ సూరారం, నాగారం గ్రామపంచాయతీలలో రూ. 20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ ప్రజలకు మెరుగైన పరిపాలన అందించే విధంగా ఈ భవనం ఉపయోగపడుతుందని అన్నారు. అలాగే మిగతా 2లో..



## వైద్యులు సూచించిన విధంగా మాత్రమే మందులు విక్రయించాలి

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**నస్పూర్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**

వివిధ వ్యాధుల నియంత్రణకు వైద్యులు సూచించిన విధంగా మాత్రమే మందుల దుకాణాల నిర్వాహకులు మందులు విక్రయించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీని డ్రగ్స్ ఇన్స్పెక్టర్ చందన, ఈగల్ ఫోర్స్ సి.ఐ. రవికుమార్, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ప్రతినిధులు చంద్రశేఖర్, సుధాకర్ లతో కలిసి జెండా ఊపి ప్రారంభించి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మందుల దుకాణాల నిర్వాహకులు, వైద్యులు సూచించిన ప్రిస్క్రిప్షన్ ప్రకారం మాత్రమే ప్రజలకు మందులను విక్రయించాలని తెలిపారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ మిగతా 2లో..

### జ్యోతిరావుపూలే ఆశయ సాధన కోసం

# కలిసికట్టుగా పనిచేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాలీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లెండుగుంరె శ్యామ్‌రావుతో కలిసి జెండా ఆవిష్కరణ చేసి, పూలే చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ మాలి కులస్తుల అభ్యున్నతికి తాను కట్టుబడి ఉన్నానని, ఎస్టి హోదా సాధన కోసం కేంద్ర స్థాయిలో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే సీఆర్ నగర్ చౌరస్తాలోని జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద కమ్యూనిటీ భవనం నిర్మాణానికి రూ. 50 లక్షల నిధులు మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటానని ్రతెలిపారు.

**మాలి కులస్తులకు ఎస్టి హోదా సాధించే వరకు తమ పోరాటం ఆగదు : లెండుగురె శ్యామ్‌రావు**

ఈ సందర్భంగా శ్యాం రావు మాట్లాడుతూ మాలి కులస్తులకు ఎస్టి హోదా సాధించే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న ఎస్టి హోదా బిల్లును ఆమోదింపజేయడానికి త్వరలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. భారతదేశంలో సామాజిక సంస్కరణల ఉద్యమానికి మార్గదర్శకుడైన జ్యోతిరావు పూలే కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన మహానుభావుడని అన్నారు. దళితులు, మహిళల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు.ఆయన భార్య సావిత్రిబాయి పూలేతో కలిసి దేశంలోనే మొదటి బాలికల పాఠశాలను ప్రారంభించి మహిళా విద్యకు మార్గం సుగమం చేశారని తెలిపారు. సమానత్వం, న్యాయం, మానవత్వం వంటి విలువలను సమాజంలో స్థిరపరిచిన మహోన్నత నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాలి సంఘ నాయకులు మోర్లే విజయ్ కుమార్, కొట్రంగే నాందేవ్, పోశెట్టి, టాకరే తిరుపతి, కిషన్, వాసకే హన్మంతు, నాను, సెండే వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్యులు సూచించిన విధంగా మాత్రమే మందులు విక్రయించాలి

(మొదటిపేజీ తరువాయి)

ఆసుపత్రుల ద్వారా వైద్య సేవలు అందించడం జరుగుతుందని, నిష్ణాతులైన వైద్యులు ప్రభుత్వ ఆసుపత్రులలో అందుబాటులో ఉన్నారని తెలిపారు. ప్రజలు సొంత ఆలోచన ప్రకారం మందులు, సిరప్ లు వినియోగించకూడదని, వైద్యులను సంప్రదించి వారి సూచన మేరకు మందులు వినియోగించాలని తెలిపారు. నార్కోటిక్, నిషేధిత డ్రగ్స్ విక్రయం, వినియోగంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, మందుల విక్రయంలో మందుల దుకాణాల నిర్వాహకులు సమిష్టిగా ఉండాలని, సరైన ప్రిస్క్రిప్షన్ లేకుండా ఎలాంటి మందులను విక్రయించకూడదని తెలిపారు. మందుల షాపుల నిర్వాహకులు సరైన అర్హత, అనుమతి తప్పనిసరిగా కలిగి ఉండాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో 7 పడకలతో ఏర్పాటు చేసిన డ్రగ్స్ డి అడిక్షన్ సెంటర్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అనిత, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు వేదవ్యాస్, ఆర్.ఎం.ఓ. భీష్మ, వైద్యాధికారులతో కలిసి ప్రారంభించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారిని సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు ఈ సెంటర్ ద్వారా వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఇంటర్, డిగ్రీ, ఐ.టి.ఐ., ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలల విద్యార్థులకు మత్తు పదార్థాలు, మద్యం వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని, అధ్యాపకులు, తల్లితండ్రులు పిల్లల ప్రవర్తనలో కలిగే మార్పులపై పర్యవేక్షించాలని, ప్రవర్తన మారిన పిల్లలను డి అడిక్షన్ సెంటర్‌కు తీసుకురావాలని తెలిపారు. ఈ సెంటర్ నిర్వహణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నిధులు కేటాయించడం జరుగుతుందని, స్వచ్ఛంద సంస్థలు డ్రగ్స్ నియంత్రణపై అధికారుల సమన్వయంతో పని చేయాలని తెలిపారు. మత్తు పదార్థాల రవాణా, విక్రయం అంశాలపై హెల్ప్ లైన్ నంబర్లు 14416, 1908లలో సమాచారం అందించవచ్చని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులతో తాము జీవితంలో ఎలాంటి మత్తు పదార్థాలు తీసుకోబోమని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డా. సునీల్ కుమార్, డా. కిరణ్ కుమార్, నర్సింగ్ అధికారులు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిషేధిత ఔషధాలను విక్రయించోద్దు

**ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త :**



నిషేధిత మందులు అమ్మొద్దని ప్రతిజ్ఞ చేస్తున్న ఫార్మాసిస్టులు

నిషేధిత ఔషధాలను విక్రయించోద్దని జిల్లా వైద్య శాఖ అధికారి సీతారాం, జిల్లా డ్రగ్ ఇన్స్పెక్టర్ అశ్విని సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలో ఔషధ నియంత్రణ వ్యవస్థ బలోపేత దినోత్సవం, 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా అవగాహన సదస్సు సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మొదటగా డ్రగ్అ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాలోని ఫార్మాసిస్టు, మెడికల్ షాప్ యజమానులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ఎస్‌ఎం గార్డెన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. డ్రగ్స్, గంజాయి, కల్తీ కల్లు వంటి నిషేధిత పదార్థాలపై నియంత్రణ అవసరాన్ని వివరించారు. అదేవిధంగా ఔషధాల సరైన వినియోగం, షెడ్యూల్డ్ డ్రగ్స్‌కు సంబంధించిన నిబంధనల గురించి అవగాహన కల్పించారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మెడికల్ షాపుల్లో మందులు విక్రయించరాదని స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన డ్రగ్స్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా హాజరైన వారందరితో నార్కోటిక్ నిషేధిత ఔషధాలను విక్రయించబోమని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అసిఫాబాద్ జిల్లాలోని పాఠశాలల్లో నిర్వహించిన డ్రగ్స్ కంట్రోల్ క్విజ్, ఎస్సే రైటింగ్ పోటీలలో విజేతలైన విద్యార్థులకు జిల్లా అధికారుల చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్ , ఈగల్ టీం మెంబర్ రమేష్, అధికారులు, కెమిస్ట్‌లు, విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు

### కాసిపేట్ మండలంలో

# పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్

(మొదటిపేజీ తరువాయి)

180 లీటర్ల గుడుంబా పానకాన్ని గుర్తించి ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా దేవాపూర్ ఎస్సై గంగారాం స్థానిక ప్రజలకు సైబర్ నేరాలపై అప్రమత్తత, గంజాయి నియంత్రణ, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, ట్రాఫిక్ నిబంధనలు, కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. అలాగే వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మూఢనమ్మకాలపై కూడా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాసిపేట్, రామకృష్ణాపూర్ ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పేదింటి ఆడపడుచులకు అండగా కాంగ్రెస్ సర్కార్

(మొదటిపేజీ తరువాయి)

గ్రామాల అభివృద్ధి, రోడ్లు, భవనాలు, మౌలిక వసతుల పెంపుదల ద్వారా ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న సర్పంచులకు శుభాకాంక్షలు తెలియజేసిన ఆయన, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని హామీ ఇచ్చారు. అలాగే మంచిర్యాల నుండి చెన్నూర్ వయా నీల్వాయి మీదుగా నాగారం, బెల్లంపల్లి, మంచిర్యాల వరకు రింగు బస్ సౌకర్యాన్ని ప్రారంభించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ విషయమై మంచిర్యాల డిపో మేనేజర్ తో ఇప్పటికే మాట్లాడినట్టు ఎమ్మెల్యే వెల్లడించారు. అలాగే నాగారం నుండి ముత్తారం వరకు, వేమనపల్లి నుండి చిన్న రస్పల్లి వరకు రోడ్డుకు త్వరలోనే పనులు మొదలయ్యేలా చూస్తానని అన్నారు. అలాగే మండలంలోని పోటు భూముల సమస్య తీర్చడానికి వచ్చే నెలలో అటవీ శాఖ మంత్రి కొండ సురేఖ ను మండలానికి తీసుకొచ్చి పోడు భూముల సమస్యలు లేకుండా చేస్తానని అన్నారు.

**పేదింటి ఆడపడుచులకు అండగా కాంగ్రెస్ సర్కార్..**

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 23 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ రూ. 23,02,668 లక్షల విలువ గల చెక్కులను గ్రామపంచాయతీ ఆవరణలో పంపిణీ చేశారు. పేదల సంక్షేమం తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి ఆర్. సంతోష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ సాబీర్ అలీ, ఎంపీడీవో కుమారస్వామి, నయాబ్ తహసీల్దార్ సాయికృష్ణ, ఎంపీఓ వెంకటేష్, డిసిసి సెక్రటరీ గాలి మధు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ముల్కల్ల సత్యనారాయణ, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు చెన్నూరు సమ్మయ్య, సర్పంచులు సాయి కృష్ణ, ముల్కల్ల శ్రీలత, కొండి మానస, ఆయిల్ల శ్రీనివాస్ రెడ్డి, అలం లక్ష్మణ్, దుర్గం భాగ్యలక్ష్మి, మడె శ్రీనివాస్, కొట్రంగి శ్రీనివాస్, ఆవులమారి పున్నం, సిడెం శ్రీలత, కుర్రు వెంకటేశం, ఒడిల రాజన్న సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రానిక్స్, హార్డ్‌వేర్ సమ్మర్ ఇంటర్న్‌షిప్ విజయవంతం

**- వృత్తి విద్యా కోర్సులతో విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది: ప్రిన్సిపల్ రాజశేఖర్**

**కోటపల్లి, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**




మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం వృత్తి విద్యా కోర్సు ఒకేషనల్ ఎలక్ట్రానిక్స్, హార్డ్‌వేర్ విభాగం విద్యార్థులు తమ 10 రోజుల సమ్మర్ ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. కోటపల్లిలోని సంపత్ కమ్యూనికేషన్ సెంటర్‌లో జరిగిన ఈ శిక్షణా తరగతుల ముగింపు సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2025-26 విద్యా సంవత్సరానికి గాను విద్యార్థులలో సాంకేతిక జ్ఞానాన్ని, నైపుణ్యాలను పెంపొందించే ఉద్దేశంతో ఈ ఇంటర్న్‌షిప్ నిర్వహించినట్లు తెలిపారు. కేవలం సిద్ధాంతపరమైన విద్యే కాకుండా, ప్రాక్టికల్ పరిజ్ఞానం పొందడం ద్వారా విద్యార్థులు తమ భవిష్యత్ కెరీర్‌లో రాణించేందుకు ఇది ఎంతో దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. వృత్తి విద్యా కోర్సులు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పునాది వంటివని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఒకేషనల్ అధ్యాపకులు డి. సంజీవ్, శ్రీసాగర్, ఉపేందర్, వృత్తి విద్యా శిక్షకులు చేకుర్తి సంపత్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా మహాత్మ జ్యోతిబా పూలే జయంతి

**తాండూర్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త :**

మండలంలోని మాదారం3 అంగన్వాడి కేంద్రంలో శనివారం మహాత్మ జ్యోతి బాపూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాదారం సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్, ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి మహాత్మ జ్యోతి బాపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వార్డు సభ్యురాలు సౌమ్య, నాయకులు పుట్టపోషం, మీస శంకర్, అన్వేష్, అంగన్వాడి టీచర్లు మీనా, యాదలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## సిఐటియు ఆధ్వర్యంలో..

మండల కేంద్రంలోని ఐబిలో శనివారం సిఐటియు ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిబాపూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జ్యోతి బాపూలే చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం, నాయకులు లీలారాణి, సుజాత, వేల్పుల శంకర్, బొల్లం రాజేశం, దుర్గం నాన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త :**

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిబాపూలే అని జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో నిర్వహించిన మహాత్మా జ్యోతిబాపులే 200వ జయంతి వేడుకలకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేష్, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ కామ్డే అనిల్, ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల మంగ, డిసిసి చైర్మన్ ఆత్రం సుగుణలతో పాటు కలిసి హాజరై చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి మాట్లాడుతూ బలహీన వర్గాల కోసం మహిళల విద్యాభ్యాసం కోసం మహాత్మ జ్యోతిబాపూలే విశిష్ట సేవలు అందించారని, విద్య ద్వారా మహిళలు, నిమ్న కులాల వారికి సాధికారత కల్పించడానికి, కుల వివక్షను నిర్మూలించడానికి కృషి చేశారని తెలిపారు. సంఘసంస్కర్తగా, తత్వవేత్తగా, విద్యావేత్తగా అనేక కార్యక్రమాలు చేపట్టారని, మహాత్మ జ్యోతిబాపూలే చూపిన బాట అనుసరించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, మహనీయుల ఆశయ సిద్ధాంతాలను ఆచరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**ఉట్నూర్, ఏప్రిల్ 11,ప్రభాతవార్త**

మహాత్మా జ్యోతి బాపూలే ఆశయాలను కొనసాగిదామని ఐటీడీఏ ప్రాజెక్టు ఉద్యాన అధికారి సందీప్ కుమార్ అన్నారు. అయన మాట్లాడుతూ మహాత్మా జ్యోతి బాపూలే సామాజిక సమానత్వం కోసం చేసిన సేవలు తరతరాలకు ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

**కెరమెరి, ఏప్రిల్ 11, ప్రభాతవార్త :**

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిబాపూలే అని మండల మాలి సంఘం అధ్యక్షుడు కొట్టంగి తిరుపతి ఎస్సై ఎన్ మధుకర్ అన్నారు . శనివారం నిర్వహించిన మహాత్మా జ్యోతిబాపులే 200వ జయంతి వేడుకలు మండలంలోని మాలి సంఘం నాయకులు మాజీ మండల ఉపాధ్యక్షులు అబ్దుల్ కలాం తోపాటు కలిసి హాజరై విగ్రహాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బలహీన వర్గాల కోసం మహిళల విద్యాభ్యాసం కోసం మహాత్మ జ్యోతిబాపూలే విశిష్ట సేవలు అందించారని, విద్య ద్వారా మహిళలు, నిమ్న కులాల వారికి సాధికారత కల్పించడానికి, కుల వివక్షను నిర్మూలించడానికి కృషి చేశారని తెలిపారు. సంఘసంస్కర్తగా, తత్వవేత్తగా, విద్యావేత్తగా అనేక కార్యక్రమాలు చేపట్టారని, మహాత్మ జ్యోతిబాపూలే చూపిన బాట అనుసరించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, మహనీయుల ఆశయ సిద్ధాంతాలను ఆచరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**బెల్లంపల్లి, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**

నిరక్షరాస్యత, మూఢనమ్మకాలు, దురాచారాలు విస్తరించి ఉన్న కాలంలో ప్రజలను చైతన్యవంతం చేసిన సంఘ సంస్కర్తల సేవలు చిరస్మరణీయమని, అలాంటి మహనీయులు సమాజంలో మహాత్ములుగా నిలిచారని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం. విజయభాస్కర రెడ్డి అన్నారు. శనివారం గోలేటి లోని జనరల్ మేనేజర్ కార్యాలయం ఆవరణలో మహాత్మా జ్యోతి రావ్ పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జీఎం పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వక్తలు పూలే చేసిన సామాజిక సేవలను కొనియాడారు. జీఎం విజయభాస్కర రెడ్డి మాట్లాడుతూ, మనుషులందరూ సమానమే, కుల మత భేదాలు లేని సమాజమే నిజమైన అభివృద్ధికి దారి తీస్తుంది అన్నారు. రెండు శతాబ్దాల క్రితం పూలే చేసిన సేవల ఫలాలను నేటి తరాలు అనుభవిస్తున్నాయని పేర్కొన్నారు. అనంతరం ఉద్యోగులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి ఎస్. తిరుపతి, సీఎంఓ ఏఐఏరియా అధ్యక్షుడు మచ్చగిరి నరేందర్, ఏరియా ఇంజినీర్ జి. కృష్ణమూర్తి, ఎస్ఓటు జిఎం కె. రాజమల్లు, బీసీ లైజన్ అధికారి మామిడి రవికుమార్, బీసీఓబీసీ ఉద్యోగ సంఘం నాయకులు పేరం శ్రీనివాస్, మారం శ్రీనివాస్, డీజీఎం (సివిల్) మదీనా బాష, పర్సనల్ విభాగం హెచ్ఓడీ మండల శ్రీనివాస్, వివిధ విభాగాల అధిపతులు, అధికారులు, బీసీ యూనియన్ నాయకులు, జీఎం కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగుర ఓసీ, గోలేటి సిహెచ్పీ, ఏరియా ఆసుపత్రి, వర్క్‌షాప్, స్టోర్స్, ఏజెంట్ ఆఫీస్, ఎంవీటీసీ కార్యాలయాల్లో కూడా మహాత్మా జ్యోతి రావ్ పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

**చింతలమానెపల్లి, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:**

చింతలమానెపల్లి మండలంలోని డబ్బా గ్రామపంచాయతీ లో మహాత్మా జ్యోతిబా ఫూలే 200వ జయంతిని అధికారికంగా ఘనంగా నిర్వహించారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు సర్పంచ్ సంతోష్ డోంగ్రి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఫూలే అనగారిన వర్గాలు, మహిళల విద్యాభివృద్ధికి చేసిన సేవలను కొనియాడుతూ, డా. బి.ఆర్. అంబేద్కర్ వంటి మహానుభావులకు ఆయన ప్రేరణగా నిలిచారని సర్పంచ్ పేర్కొన్నారు. చింతలమానెపల్లి మాలి కుల సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన నికోడె సందీప్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గుర్లె శీనివాస్, వార్డు సభ్యులు, మాలి సంఘం పెద్దలు, మహిళలు, గ్రామ యువత తదితరులు పాల్గొన్నారు.

**సిరికొండ, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:**

అణగారిన వర్గాల ఆశాజ్యోతి, సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిబాపూలే జయంతి వేడుకలు సిరికొండ మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, సమాజంలో అస్పృశ్యత నివారణకు, మహిళా విద్య కోసం పూలే చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. విద్య ద్వారానే సామాజిక మార్పు సాధ్యమని నమ్మిన మహనీయుడు పూలే అని పేర్కొన్నారు. ఆయన స్థాపించిన సత్యశోధక్ సమాజ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ పుణికిపుచ్చుకోవాలని, కులమతాలకు అతీతంగా సమానత్వం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో మండల స్థాయి నాయకులు, వివిధ పార్టీల కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొని పూలే ఆశయాల సాధనకు ప్రతిజ్ఞ చేశారు.

**నిర్మల్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:**

కలెక్టరేట్ సమావేశ మందిరంలో సామాజిక విప్లవకారుడు మహాత్మ జ్యోతిబా ఫూలే జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆర్డీవో రత్న కళ్యాణి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అణగారిన వర్గాల అభ్యున్నతికి ఫూలే చేసిన కృషి ఎనలేనిదని, ఆయన చూపిన బాటలో అందరూ నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, డీఈవో భోజన్న, అసిస్టెంట్ బీసీ సంక్షేమ అధికారి సత్యనారాయణ, వివిధ సంఘాల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.



మహాత్మ జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం



నివాళులు అర్పిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి




సిఐటియు ఆధ్వర్యంలో జ్యోతిబాపూలే జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



నివాళులు అర్పిస్తున్న ఐటీడీఏ అధికారులు



మహాత్మా జ్యోతిబాపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు






చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న గ్రామస్తులు



జ్యోతిబా పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్డీవో రత్న కళ్యాణి

# మహాత్మా జ్యోతిబా పూలే సేవలు మరువలేనివి


నివాళులర్పిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**నేరడిగొండ, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:**

భారత సంఘసంస్కర్త, మానవతావాది మహాత్మా జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా నేరడిగొండ మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి, పేదల విద్యాభివృద్ధికి పూలే చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**భైంసా, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:**

సామాజిక ఉద్యమాలకు మార్గదర్శి, సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను భైంసాలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే నారాయణ్ రావు పటేల్ పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అణగారిన వర్గాల సామాజిక న్యాయం, మహిళా విద్య కోసం పూలే చేసిన కృషి అందరికీ మార్గదర్శకమని పేర్కొన్నారు. సామాజిక సాధికారత కోసం పూలే స్ఫూర్తితోనే ప్రభుత్వం కుల గణన, ఎస్సీ వర్గీకరణ వంటి నిర్ణయాలతో ముందుకు సాగుతోందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ చంద్రి, మాజీ సొసైటీ చైర్మన్ శ్యామ్ రావు పటేల్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**భైంసా, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:**

మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలను భైంసా పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సభ్యుడు సుంకేట మహేష్ బాబు పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పూలే పేరుతో ఉన్న గురుకులాలను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం గురుకులాల్లో విద్యార్థులు సరైన సౌకర్యాలు లేక, అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి, భవిష్యత్ తరాలకు అండగా నిలవాలని కోరారు. మహనీయుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకుడు యశ్వంత్ బాన్సోడే, మోచి సంఘం నాయకుడు సాయినాథ్, సోషల్ వర్కర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


జ్యోతిబా పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జనసేన పార్టీ సభ్యుడు సుంకేట మహేష్ బాబు

**జైనూర్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:**

సమాజంలోని కుల వివక్షను రూపుమాపి, అణగారిన వర్గాల విద్యాభివృద్ధికి మహాత్మ జ్యోతిరావు పూలే చేసిన సేవలు చిరస్మరణీయమని జైనూర్ సర్పంచ్ కొడప ప్రకాష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జ్యోతిరావు పూలే చౌక్‌లో మాలి సంఘం ఆధ్వర్యంలో ఆయన 199వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. పూలే ఆనాటి కాలంలోనే సామాజిక సమానత్వం కోసం, మహిళా విద్య కోసం అహర్నిశలు కృషి చేసిన గొప్ప సంస్కర్త అని కొనియాడారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాలి సంఘం మండల అధ్యక్షుడు పెట్టుకులే హుస్సేన్, జిల్లా నాయకులు మవాలే దత్త మాంగ్, శివునూర్ సర్పంచ్ జాదవ్ శ్రావణ్, భీంరావు, రాందాస్, శేషారావు, జయరాం తదితరులు పాల్గొన్నారు.


జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సర్పంచ్ కొడప ప్రకాష్

**మందమర్రి, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**

మందమరి మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు జ్యోతిబా ఫూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మహాత్మా జ్యోతీరావ్ గోవింద్ ఫూలే 1827 ఏప్రిల్ 11న మహారాష్ట్ర రాష్ట్రంలోని సతారా గ్రామంలో మాలి కుటుంబానికి చెందిన గోవిందరావు, చిన్నూభాయి దంపతులకు జన్మించారని తెలిపారు. ఆ కాలంలో సమాజంలో నెలకొన్న అసమానతలు, కులవివక్షలు, అవిద్య కారణంగా ముఖ్యంగా స్త్రీలు వెనుకబడి ఉన్నారని గ్రహించి, స్త్రీ విద్య అభివృద్ధికి ఆయన విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం సాధించడానికి, లింగ వివక్షను తొలగించడానికి విద్యే ప్రధాన సాధనం అని ఫూలే నమ్మారు. అమెరికా రచయిత థామస్ పైన్ రచించిన ది రైట్స్ ఆఫ్ మ్యాన్ గ్రంథం ప్రభావంతో ఆయనలో సామాజిక చైతన్యం పెరిగింది. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి బాలబాలికల కోసం పాఠశాలలను స్థాపించారు. అణగారిన వర్గాల హక్కుల కోసం, స్త్రీ సమానత్వం కోసం, రైతుల సమస్యల పరిష్కారం కోసం ఆయన నిరంతరం పోరాటం సాగించారు. ప్రజల్లో అక్షరాస్యత పెంపొందించేందుకు చేసిన సేవలకు గుర్తింపుగా 1888లో ముంబైకు చెందిన సామాజిక సంస్కర్త రావ్ బహుదూర్ విఠల్ రావు కృష్ణాజీ వాండేకార్ తదితరులు కలిసి ఆయనకు మహాత్మా బిరుదును ప్రదానం చేశారు. మహాత్మ జ్యోతిబా ఫూలే ఆలోచనలు తరువాతి కాలంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్ఫూర్తిగా నిలిచాయి. సమసమాజ నిర్మాణానికి ప్రతి వ్యక్తికి స్వేచ్ఛ, సమాన హక్కులు అవసరమని ఆయన విశ్వసించారు. మానవ హక్కుల, పౌరహక్కుల ఉద్యమాలకు పునాది వేసిన మహోన్నత వ్యక్తి ఫూలే 1890 నవంబర్ 28న పూణేలో పరమపదించారు. సామాజిక సమానత్వం, సమరసత కోసం కృషి చేసిన మహాత్మా జ్యోతిబా ఫూలే ఆశయాలను ఆచరించడం ద్వారానే ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్టవుతుందని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ఎం.ఏ. సమీర్, ప్రజారోగ్య కార్మికుడు చిప్పకుర్తి రాజశేఖర్, సిస్టమ్ మేనేజర్ ఎ. శిరిష్, డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ బి. శ్యాంబాబు, బెక్కం ప్రసాద్, ఉప్పు రవీందర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ ఎం. గోపి కృష్ణ, ఇచ్చినూరి రవీందర్, గోలే అశోక చక్రవర్తి, ఎకుల సాయి కుమార్ తదితర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

**మందమర్రి, ఏప్రిల్11, ప్రభాతవార్త**

సామాజిక న్యాయం, సమానత్వం కోసం జీవితాన్ని అంకితం చేసిన మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు మందమర్రి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టణ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని సంఘం పట్టణ అధ్యక్షుడు సకినాల శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించగా, గౌరవ అధ్యక్షుడు పోలు శ్రీనివాస్ పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పూలే ఆశయాలను స్మరించుకుంటూ ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే భారతదేశంలో సామాజిక సంస్కరణల పితామహుడిగా నిలిచారని తెలిపారు. 1827లో మహారాష్ట్రలో జన్మించిన పూలే, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పోరాడారని గుర్తుచేశారు. మహిళా విద్యకు శ్రీకారం చుట్టిన మహనీయుడిగా, తన భార్య సావిత్రిబాయి పూలేతో కలిసి మొదటి బాలికల పాఠశాలను స్థాపించడం ద్వారా సమాజంలో విప్లవాత్మక మార్పుకు నాంది పలికారని పేర్కొన్నారు. కుల వివక్ష, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన పూలే, విద్యే విముక్తికి ఆయుధం అనే సిద్ధాంతంతో సమాజంలో చైతన్యం తీసుకువచ్చారని అన్నారు. ఆయన స్థాపించిన సత్యశోధక సమాజం ద్వారా సమానత్వం, స్వాభిమానానికి బాటలు వేసారని వివరించారు. ప్రస్తుత సమాజంలో కూడా పూలే ఆశయాలు ఎంతో ప్రాసంగికమని, ఆయన చూపిన మార్గంలో నడవడం ద్వారా మాత్రమే సమానత్వ సమాజాన్ని నిర్మించగలమని నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి బత్తుల సతీష్, వర్కింగ్ కోశాధికారి కడాలి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, వైస్ ప్రెసిడెంట్ బేర వేణుగోపాలరావు, పారుపల్లి శివరామకృష్ణ, ఎదులాపురం రాజు, నర్సోజీ, ఎగ్జిక్యూటివ్ వర్కింగ్ ప్రెసిడెంట్ గట్ల సారంగపాణి, కార్యదర్శులు పెండ్యాల గౌతం, పోలు సంపత్, పోలు కుమార్, సంతోషా చారి, చింతల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**చెన్నూరు, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**

బడుగు బలహీన వర్గాల శ్రేయస్సు కోసం జ్యోతిరావు పూలే చేసినటువంటి సేవలు మరువలేనివని పలు పార్టీల నాయకులు కొనియాడారు. శనివారం రోజు జ్యోతిరావుఫూలే జయంతి సందర్భంగా మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ పార్టీల నాయకులు, కుల సంఘాల ఆధ్వర్యంలో ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా చెన్నూరు పట్టణంలో మహాత్మా జ్యోతిరావ్ పూలె జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని పాత తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న పూలే విగ్రహానికి కాంగ్రెస్, బీజేపీ, బిఆర్ఎస్, దళిత సంఘాల నాయకులు, బీసీ సంఘాల నాయకులు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ బాపూరావు పూలే జాతికి అందించిన సేవలను కొనియాడారు.


నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే నారాయణ్ రావు పటేల్








# సమానత్వంకై మహాత్మా జ్యోతిబాపూలే చేసిన కృషి చిరస్మరణీయం

## - జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య

**నస్పూర్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**

సామాజిక న్యాయం, విద్యా విస్తరణ, సమానత్వం కోసం మహాత్మ జ్యోతిబాపూలే చేసిన కృషి చిరస్మరణీయమని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. మహాత్మ జ్యోతిబాపూలే జయంతిని పురస్కరించుకొని శనివారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, వివిధ శాఖల అధికారులు, బిసి సంఘాల ప్రతినిధులతో కలిసి మహాత్మ జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక న్యాయం, విద్యా విస్తరణ, సమానత్వం కోసం మహాత్మ జ్యోతిబాపూలే విశేష కృషి చేశారని తెలిపారు. పేదలు, మహిళలు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి అందించిన సేవలు అందరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. మహనీయుల ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సమాజంలో సమానత్వం కోసం, అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, వివిధ బి.సి. సంఘాల ప్రతినిధులు, వసతి గృహ సంక్షేమ అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**క్యాతన్ పల్లి, ఏప్రిల్11,ప్రభాతవార్త**

మహాత్మా జ్యోతి రావు బాపూలే ఆశయాలను కొనసాగించాలని రామకృష్ణా పూర్ సిహెచ్‌పి సెక్షన్ ఇంజనీర్ చంద్రమోళి అన్నారు. శనివారం రామకృష్ణాపూర్ సీహెచ్‌పిలో సింగరేణి బ్యాక్ వార్డ్ క్యాస్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని సంఘం గౌరవ అధ్యక్షుడు నలువల సమ్మయ్య యాదవ్ జెండా ఆవిష్కరించగా, ఎస్ఈ చంద్రమోళి యూనియన్ నాయకులు, బీసీ నాయకులతో కలిసి కేకే కట్ చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్ర మోళి మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే దేశంలో గొప్ప సామాజిక సంస్కర్తగా నిలిచారని తెలిపారు. మహిళల విద్యాభివృద్ధి, దళితుల హక్కుల పరిరక్షణ కోసం ఆయన చేసిన కృషి సమాజంలో సమానత్వానికి బలమైన పునాది వేసిందన్నారు. ప్రజలు ఆయన ఆలోచనలు, సేవలను స్మరించుకుని సమాజంలో సమానత్వం, విద్య ప్రాముఖ్యతను మరింతగా పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. పూలే ఆశయాలను స్మరించుకుంటూ ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిఎస్పీ సంఘం అధ్యక్షుడు మండల శ్రీనివాస్, కోల మోహన్, బీరం రాజయ్య, కె శ్రీనివాస్, శ్రీకాంత్, నరేంద్ర, మహేందర్, జె శ్రీనివాస్, అధికారులు, బీసీ కమిటీ నాయకులు, యూనియన్ నాయకులు, బీసీ సంక్షేమ సంఘం నాయకులు, మహిళా కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

### సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో..

**జైపూర్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**

సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ లో శని వారం అధికారులు మహాత్మా జ్యోతిరావు బాపూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎస్టీపిపి ఈడి సిహెచ్. చిరంజీవి మహాత్మా జ్యోతిరావు బాపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎస్టిపిపి ఉద్యోగులు పూలే చిత్రపటానికి పూలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఈడి, జిఎంలు మహాత్మ జ్యోతి బాపూలే జయంతి సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఈడి చిరంజీవి మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు ఫూలే (1827-1890) భారతదేశపు అగ్రగణ్య సాంఘిక సంస్కర్త, విద్యావేత్త, కుల నిర్మూలన పోరాట యోధుడని కొనియాడారు.



పూణేలో తన భార్య సావిత్రిబాయితో కలిసి 1848లో బాలికల కోసం మొదటి పాఠశాల స్థాపించి, స్త్రీ విద్యకు, అణగారిన వర్గాల అభ్యున్నతికి బాటలు వేశారని తెలిపారు. సత్యశోధక్ సమాజ్ స్థాపించి కుల వివక్షకు, సమాజంలోని మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడారని అన్నారు. ఆయన వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించారని, బాల్య వివాహాలను వ్యతిరేకించారన్నారు. అస్పృశ్యత నిర్మూలనకు జీవితాంతం కృషి చేశారు. పూలే గులాంగిరి (గులాం తనము), షెత్కర్యాంచ అసూడ్ (రైతు కష్టాలు), సర్వజనిక్ సత్యధర్మ వంటి పుస్తకాల ద్వారా సమాజంలోని దురాచారాలను ప్రశ్నించారని తెలిపారు. సత్యశోధక సమాజం తరపున దీనబంధు వార పత్రిక ప్రారంభించారు. దీనిలో రెతులు, కార్మికుల సమస్యలు, బాధలు వివరించేవారని, సమాజంలో వెనుకబడిన వర్గాల ప్రజలు, మహిళల అభ్యున్నతి కోసం చేసిన కృషికి ఆయనకు మహాత్మ బిరుదు ఇచ్చారని తెలిపారు. పూలే జయంతి సందర్భంగా ఎస్టీపిపిలో నిర్వహించిన క్విజ్ కాంపిటీషన్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జీఎం నరసింహారావు, (పీసిఎస్ అండ్ ఓ అండ్ ఎం) జిఎం మదన్మోహన్, ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరీ సత్యనారాయణ, సీఎంఓఏఐ బ్రాంచ్ ప్రెసిడెంట్ పంతులా, పవర్ ప్లాంట్ హెడ్ అచల్ కపూర్, డీజీఎం (పర్సనల్) కిరణ్ బాబు, ఎస్టీపిపి బిసి లైసన్ ఆఫీసర్ వీర బ్రహ్మం, ఎస్టిపిపి బిసి వెల్ఫేర్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ మెరుగు రాకేష్, బిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్. విజయ్ కుమార్, ఎస్సీ లైసెనింగ్ ఆఫీసర్ జనగామ శ్రీనివాస్ , ఎస్టి అసోసియేషన్ తరపున బానోతు రాము, ఇతర అధికారులు, ఉద్యోగులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### బిజెపి ఆధ్వర్యంలో..

**దండేపల్లి ఏప్రిల్ 11 ప్రభాతవార్త**

దండేపల్లి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే 199 వ జయంతి సందర్భంగా ఘనంగా నిర్వహించారు. శనివారం ఈ సందర్భంగా మండల ఉపాధ్యక్షులు వనపర్తి రాకేష్ మాట్లాడుతూ...కుల వ్యవస్థ నిర్మూలన అంటరానితనంతో పాటు మహిళ ఉద్ధరణకు కృషి చేశాడని దిగువ కులాల ప్రజల సమాన హక్కుల కొరకు సత్యశోధక్ సమాజ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ... వారి ఆశయాలను మనమందరం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శక్తి కేంద్రం ఇంచార్జ్ చీర్ల వెంకటేశ్వర్లు బూత్ అధ్యక్షులు వేముల హరీష్, నెల్కి నరేష్, జనరల్ సెక్రటరీ స్వర్గం శంకరయ్య, కొల్లూరి రాకేష్, అసోసియేషన్ అధ్యక్షులు బొమ్మన మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల స్ఫూర్తితో రక్తదానం చేయాలి

### - సీఐటీయూ శ్రీరాంపూర్ బ్రాంచ్ పిలుపు

**- నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో 13న మెగా రక్తదాన శిబిరం**

**నస్పూర్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**

మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతుల సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో



రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. శ్రీరాంపూర్ బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు గుల్ల బాలాజీ, కస్తూరి చంద్రశేఖర్ శనివారం ఈ వివరాలను వెల్లడించారు. తలసేమియా బాధితులను ఆదుకోవడమే లక్ష్యంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టారు. ఉదయం 9:30 గంటలకు శిబిరం ప్రారంభమవుతుంది. సామాజిక సేవలో భాగంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి అభ్యుదయ భావాలు గల ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథులుగా శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి హాజరవుతారు. తలసేమియా బాధితులు రక్తం దొరకక పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు నాయకులు తెలిపారు. సింగరేణి కార్మికులు, కార్మికేతరులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. మహనీయుల ఆశయాలకు అనుగుణంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం గర్వకారణమని పేర్కొన్నారు. రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం చేసిన వారవుతారని వివరించారు. దేశానికి విజ్ఞానం పంచిన మహనీయుల జయంతి వేడుకలను సేవా దృక్పథంతో జరుపుకోవాలని సూచించారు. రక్తదాతలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తలసేమియా బాధితులకు అండగా నిలవాలని కోరారు. ఈ శిబిరానికి సంబంధించిన ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేసినట్లు వెల్లడించారు.

**మంచిర్యాల,ఏప్రిల్ 11, ప్రభాతవార్త**

మహాత్మ జ్యోతి బాపులే జయంతి వేడుకలు మంచిర్యాల అస్పిరెంట్ అకాడమీలో శనివారం రోజు మహాత్మ జ్యోతిబాపూలే 199 జయంతి సందర్భంగా అస్పిరెంట్ అకాడమీలో నిర్వహించారు. బహుజన ముద్దుబిడ్డ బహుజనాల ఆశాజ్యోతి జ్యోతి బాబులే విద్య అనే ఆయుధంతో ప్రపంచాన్ని జయించొచ్చు విద్య అనే జ్ఞానంతో సమాజానికి జ్ఞానాన్ని పంచవచ్చు తన జీవితాన్ని తన భాగస్వామి అయిన సావిత్రిబాయి పూలే తో కలిసి విద్య అందరికీ ముఖ్యంగా మహిళలకు అవసరం ఉందని చెప్పి తన శ్రీమతితో సంసారాన్ని పక్కన పెట్టి భాగస్వాములు ఇద్దరు ఎన్నో సమస్యలు ఎదుర్కొని ఈరోజు బహుజనులకు న్యాయం జరుగుతుందంటే మహాత్మా జ్యోతిబా ఫూలే దంపతులు అని న్యాయవాది నటేశ్వర్ పేర్కొన్నారు. దీనిలో భాగంగా అస్పిరెంట్ అకాడమీ చైర్మన్ నిహార్ వర్మ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.







పాల్గొన్న అస్పిరెంట్ అకాడమీ సభ్యులు



శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**నేరడిగొండ, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:**

నేరడిగొండ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో నాఫెడ్, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివారం ప్రారంభించారు. పీఏసీఎస్ కుమారి, ప్రజామిత్ర ఆధ్వర్యంలో ఈ కేంద్రం పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులు దళారులను నమ్మి తక్కువ ధరలకు పంటను అమ్ముకోవద్దని, ప్రభుత్వం కల్పించే మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తూ వారికి అండగా ఉండాలని ఆదేశించారు. కష్టపడి పండించిన పంటకు సరైన ధర లభించినప్పుడే రైతులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



టోకెన్లు పంపిణీ చేస్తున్న మార్కెట్ చైర్మన్ అబ్దుల్ హాది

## మొక్కజొన్న కొనుగోలుకు రంగం సిద్ధం

**సారంగాపూర్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:**

మండలంలోని సారంగాపూర్ మార్కెట్‌లో మొక్కజొన్న కొనుగోలుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో మార్కెట్ చైర్మన్ అబ్దుల్ హాది శనివారం రైతులకు టోకెన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రం లేక ఇబ్బందులు పడ్డ రైతులకు ప్రభుత్వం కేంద్రాన్ని మంజూరు చేయడం హర్షణీయమని పేర్కొన్నారు. క్వింటాల్ మొక్కజొన్నకు రూ. 2,400 మద్దతు ధర ప్రకటించినట్లు తెలిపారు. రైతులందరూ తమ పంటను మార్కెట్‌కు తీసుకువచ్చి అమ్ముకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భూమారెడ్డి, డైరెక్టర్ పోతారెడ్డి, రమేష్, సాయన్న, రైతులు పాల్గొన్నారు.

## నిర్మల్‌లో ఘనంగా వారసత్వ సంబురాలు

**నిర్మల్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:**

నిర్మల్ పట్టణంలోని సిటీ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో శనివారం వారసత్వ సంబురాలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, మాజీ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన ఈ సభలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్ర, వైద్య వృత్తి, సంస్కృతిపై రచయితలు రాసిన పలు పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ, జిల్లాతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. రచయితలు విశేషంగా సాహిత్య సృష్టి చేస్తున్నారని, ముఖ్యంగా మహిళా రచయితలు ముందుకు రావడం గర్వకారణమని పేర్కొన్నారు. అనంతరం వైద్యులను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, వైద్యులు, నిర్వాహకులు పాల్గొన్నారు.



# బెల్లంపల్లిలో జై భీమ్ అంబేద్కర్ సాంగ్ ఘన ఆవిష్కరణ

### - యువ కళాకారుడి అంబేద్కర్ గీతం విడుదలకు ప్రశంసల వెల్లువ

**బెల్లంపల్లి, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**



బెల్లంపల్లి పట్టణానికి చెందిన ప్రముఖ కళాకారుడు జంజిరాల దినేష్ కుమార్ రచించి, స్వయంగా ఆలపించిన జై భీమ్ అంబేద్కర్ సాంగ్-2026ను ఘనంగా ఆవిష్కరించారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం పట్టణంలో విశేష ఆకర్షణగా నిలిచింది. స్థానిక ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఉన్న మహనీయుల విగ్రహాలకు పూలమాలలు అర్పించి, కళాకారుల ఆధ్వర్యంలో పాటను అధికారికంగా విడుదల చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి హనుమాండ్ల మధుకర్, మంచిర్యాల జిల్లా నృత్య కళా సమాఖ్య అధ్యక్షులు రాకం సంతోష్ హాజరై జై భీమ్ అంబేద్కర్ సాంగ్-2026 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హనుమాండ్ల మధుకర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని బెల్లంపల్లి యువ కళాకారుడు దినేష్ కుమార్ రచించి పాడిన ఈ గీతం విడుదల కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. బిగ్ బాస్ ఫేమ్ సంగీత దర్శకుడు బోలే షావలి పర్యవేక్షణలో డప్పు మహేందర్ అఫీషియల్ యూట్యూబ్ ఛానల్‌లో ఈ పాట విడుదల కావడం గర్వకారణమని తెలిపారు. నృత్య కళా సమాఖ్య అధ్యక్షుడు రాకం సంతోష్ మాట్లాడుతూ, దినేష్ కుమార్ ప్రతిభావంతమైన కళాకారుడని, భవిష్యత్తులో మరిన్ని మంచి పాటలతో ప్రజలను అలరించాలని ఆకాంక్షించారు. జై భీమ్ అంబేద్కర్ పాట ఎంతో ప్రభావవంతంగా, హృదయాన్ని హత్తుకునేలా ఉందని, ప్రతి ఒక్కరూ తప్పక విని, యూట్యూబ్ ఛానల్‌ను సబ్స్క్రైబ్ చేసి, షేర్ చేసి, తమ అభిప్రాయాలను తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణానికి చెందిన సీనియర్ కళాకారులు బొంకూరి రామచందర్, శ్యాం కుమార్ యాదవ్, రాజేష్, రిటైర్డ్ ఏఈ మిట్టపల్లి మల్లన్న, కందుల రాకేష్, రవి, శ్రీకాంత్, దత్తు తదితరులు, అంబేద్కర్ భావజాలాన్ని అనుసరించే పలువురు పాల్గొన్నారు.



## సిరికొండ విద్యార్థుల ప్రభంజనం..

### - గురుకుల సీటు సాధించిన బోడ్డు సంజయ్

**సిరికొండ, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:**

గురుకుల పాఠశాలల ప్రవేశ పరీక్షా ఫలితాల్లో సిరికొండ మండల కేంద్రానికి చెందిన విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. తాజాగా వెలువడిన ఫలితాల్లో బోడ్డు అశోక్ కుమారుడు బోడ్డు సంజయ్ ప్రతిష్టాత్మకమైన గురుకుల పాఠశాలలో సీటు సాధించి మండల స్థాయిలోనే గర్వకారణంగా నిలిచారు. సంజయ్ సాధించిన ఈ విజయంతో కలిపి, ఇప్పటివరకు సిరికొండ మండల కేంద్రం నుండి మొత్తం నలుగురు విద్యార్థులు గురుకులాల్లో ప్రవేశం పొందడం విశేషం. క్రమశిక్షణతో కూడిన చదువు, పట్టుదలే ఈ విజయానికి కారణమని విద్యార్థి తల్లిదండ్రులు, స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీటు సాధించిన బోడ్డు సంజయ్‌ను, మిగిలిన ముగ్గురు విద్యార్థులను గ్రామ ప్రముఖులు, ఉపాధ్యాయులు హృదయపూర్వకంగా అభినందించారు. రాబోయే రోజుల్లో వీరంతా మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షి    ంచారు.

## గుడుంబా, గంజాయిపై ఉక్కుపాదం

### - ఎస్ఐ పూజ హెచ్చరిక

**సిరికొండ, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:**



సమాజానికి కీడు చేస్తున్న గుడుంబా, గంజాయి విక్రయాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు సిరికొండ ఎస్ఐ పూజ తెలిపారు. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న ఇటువంటి అక్రమ వ్యాపారాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా గుడుంబా తయారీ లేదా గంజాయి రవాణా జరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అక్రమ కార్యకలాపాల వివరాలను పోలీసుల అధికారిక వాట్సాప్ నంబర్‌కు పంపవచ్చని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. ఎవరూ భయపడకుండా ముందుకు వచ్చి పోలీసులకు సహకరించాలని, అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపేందుకు ప్రజల భాగస్వామ్యం అవసరమని ఎస్ఐ పూజ పేర్కొన్నారు.

## మాజీ సర్పంచ్ పెంటన్నను పరామర్శించిన ఎంపీ నగేశ్

**సిరికొండ, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:**

మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ పెంటన్నను పార్లమెంట్ సభ్యులు గోడం నగేశ్ శనివారం పరామర్శించారు. పెంటన్న ఇటీవల గుండె శస్త్రచికిత్స చేయించుకుని ఆసుపత్రి నుంచి కోలుకుని తన స్వగృహానికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీ ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పెంటన్న త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని ఈ సందర్భంగా ఆకాంక్షి    ంచారు. ఈ పరామర్శలో మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న ఎంపీ గోడం నగేశ్

## మైనార్టీ గురుకుల అడ్మిషన్ మేళాకు విశేష స్పందన

**జైనూర్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:**

జైనూర్ మైనార్టీ బాలికల గురుకుల అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా మండల కేంద్రంలోని జామా మసీదు వద్ద శనివారం ప్రత్యేక అడ్మిషన్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా గురుకుల ప్రిన్సిపాల్ సూఫీయా నాజ్ మాట్లాడుతూ, మైనార్టీ విద్యార్థులు గురుకులాల్లో అందుతున్న నాణ్యమైన విద్యను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. గురుకులంలో విద్యార్థులకు ఉచిత విద్యతో పాటు వసతి, పోషకాహారం, యూనిఫామ్‌లు, పాఠ్యపుస్తకాలు అందజేస్తున్నామని వివరించారు. అలాగే డిజిటల్ క్లాసులు, సైన్స్ ల్యాబ్‌లు, క్రీడా సదుపాయాలు, పోటీ పరీక్షలకు ప్రత్యేక కోచింగ్ కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. అడ్మిషన్ల అర్హతలు, దరఖాస్తు విధానంపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ మేళాకు పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు హాజరై గురుకుల విద్యపై ఆసక్తి కనబరిచారు.



# ప్రజల ఆరోగ్యమే మున్సిపల్ కార్పొరేషన్ ప్రథమ కర్తవ్యం

*** మంచిర్యాల మేయర్ ధర్ని మధుకర్ * 2వ డివిజన్‌లో ముమ్మరంగా 99 రోజుల ప్రగతి ప్రణాళిక పనులు**

నస్పూర్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త

ప్రజల ఆరోగ్యమే మున్సిపల్ కార్పొరేషన్ ప్రథమ కర్తవ్యమని మేయర్ ధర్ని మధుకర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రగతి ప్రణాళికతో పాటు జమంచిర్యాల శుభ్రత ప్రతి ఒక్కరి ఆరోగ్య భద్రతచ కార్యక్రమంలో భాగంగా శనివారం 02వ డివిజన్‌లో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ చేపట్టారు. ఈ పనులను డిప్యూటీ మేయర్ సల్ల రమ్య మహేష్‌తో కలిసి మేయర్ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. పారిశుద్ధ్య పనుల పురోగతిపై అధికారులకు తగిన సూచనలు చేశారు. పట్టణ అభివృద్ధి, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు ధర్ని మధుకర్ వెల్లడించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించి పారిశుద్ధ్య కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రతి డివిజన్‌లో పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు కూడా తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని మున్సిపల్ యంత్రాంగానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 02వ డివిజన్ కార్పొరేటర్ పుట్ట యశోద, మంచిర్యాల మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సల్ల మహేష్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు భూపతి శ్రీనివాస్, నస్పూర్ యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అజయ్ గౌడ్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



02వ డివిజన్‌లో 99 రోజుల ప్రగతి ప్రణాళిక పనులను పరిశీలిస్తున్న మేయర్ ధర్ని మధుకర్



ఆర్థిక సహాయం అందిస్తున్న నాయకులు

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**- బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు తగరపు గంగయ్య**

లక్షెట్టిపేట, ఏప్రిల్ 11, ప్రభాతవార్త

లక్షెట్టిపేట మండలం హనుమంత్ పల్లె గ్రామానికి చెందిన భారతీయ జనతా పార్టీ కార్యకర్త సింహ రాజుల వెంకటేష్ అమ్మ అనారోగ్యంతో ఇటీవల మరణించింది. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ నాయకులు వారి కుటుంబాన్ని పరామర్శించి ఈ విషాదం నుంచి వెంకటేష్ కుటుంబ సభ్యులు కోలుకోవాలని వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి వారికి వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు తగరపు గంగన్న, వెంకటేష్ కుటుంబానికి 50 కేజీల బియ్యం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ మండల అధ్యక్షులు బొప్పు కిషన్, మండల ప్రధాన కార్యదర్శి భోకసపల్లి సతీష్, సీనియర్ నాయకులు అట్లూరి దేవేందర్, కాండపు వంశీకృష్ణ, వారి కుటుంబాన్ని పరామర్శించడం జరిగింది.



## చంద్రవెల్లి అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ అవగాహన కార్యక్రమం

బెల్లంపల్లి, ఏప్రిల్ 11, ప్రభాతవార్త

బెల్లంపల్లి మండలంలోని చంద్రవెల్లి గ్రామ అంగన్వాడీ కేంద్రం-3లో శనివారం పోషణ పక్వాడ కార్యక్రమాన్ని అంగన్వాడీ టీచర్ వల్ల మల్లక్క ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పిల్లలు, గర్భిణీలు, కిశోర బాలికలకు సరైన పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉపసర్పంచ్ గజెల్లి రాజ్ కుమార్ మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు సమతుల్య ఆహారం అవసరమని తెలిపారు. గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు సమయానికి పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్య సమస్యలను నివారించవచ్చన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, తల్లులు పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ హెల్పర్ రాజేశ్వరి, ఆయా, గ్రామ తల్లులు, చిన్నారులు పాల్గొని పోషణపై అవగాహన పొందారు.

## జాతీయ రహదారి పక్కన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**- మృతుని వివరాలు తెలిస్తే సంప్రదించాలని కోటపల్లి పోలీసుల విజ్ఞప్తి**

కోటపల్లి, ఏప్రిల్ 11 ప్రభాతవార్త



మంచిర్యాల జిల్లా కోటపల్లి మండల పరిధిలో ఒక గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు శనివారం వెల్లడించారు. స్థానిక కొల్లూరు గ్రామ శివారులోని జాతీయ రహదారి 63 పక్కన సుమారు 40 ఏళ్ల వయస్సు గల పురుషుడి మృతదేహం పడి ఉండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు బూడిద రంగుపై నలుపు డిజైన్ ఉన్న షర్టు, నలుపు రంగు ట్రాక్ ప్యాంటు ధరించి ఉన్నాడని, ముఖంపై దట్టమైన గడ్డం, మీసాలు ఉన్నాయని పోలీసులు తెలిపారు. మరణించే సమయంలో మృతుని నోటి నుండి నురగ వచ్చి ఉండటాన్ని గుర్తించారు. మృతునికి సంబంధించిన ఎలాంటి వివరాలు లభించకపోవడంతో, ఆనవాళ్లను బట్టి ఎవరైనా గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం తెలిసిన వారు కోటపల్లి ఎస్సై ఫోన్ నెంబర్లు 8712656556 లేదా 8712658674 కు సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

## ద్విచక్ర వాహనం అదుపుతప్పి ప్రమాదం

**- ఇద్దరికి గాయాలు**

మందమర్రి, ఏప్రిల్ 11, ప్రభాతవార్త



మందమరి మండలం బొక్కలగుట్ట సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోవడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి గాయపడిన వారిని చికిత్స కోసం సమీప ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. వారి పరిస్థితిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదానికి గల కారణాలు ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.



## సంబాజీగూడలో రోడ్డు ప్రమాదం.. క్షతగాత్రులను ఆదుకున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

జైనూర్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం సంబాజీగూడ సమీపంలో శనివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో పలువురు గాయపడ్డారు. అదే సమయంలో జైనూర్ నుండి ఆసిఫాబాద్ వైపు వెళ్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రమాదాన్ని గమనించి వెంటనే తన వాహనాన్ని ఆపారు. కిందపడి గాయాలతో ఉన్న క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే, తక్షణమే 108 వాహనానికి సమాచారం అందించారు. బాధితులను సకాలంలో ఆసుపత్రికి తరలించేలా చొరవ చూపి తన మానవత్వాన్ని చాటుకున్నారు. అనంతరం ఉట్నూర్ వైద్యాధికారులతో ఫోన్‌లో మాట్లాడి, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని, అవసరమైతే రిమ్స్ ఆసుపత్రికి తరలించాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్ రావు ఉన్నారు.



## సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన కౌన్సిలర్

లక్షెట్టిపేట, ఏప్రిల్ 11, ప్రభాతవార్త

మున్సిపాలిటీలోని 13వ వార్డులో కౌన్సిలర్ బిరుదుల సత్యనారాయణ, వార్డ్ అధ్యక్షుడు సయ్యద్ హాజీ ఆధ్వర్యంలో సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, సురేఖ ఆశీస్సులతో 13వ వార్డు లోని ఖబ్రస్తాన్ వెళ్లే దారి సరిగా లేక అనేక సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన మైనారిటీలు ఇట్టి విషయం ఎమ్మెల్యే దృష్టికి చెప్పడంతో వెంటనే బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ కబ్రస్థాన్ రోడ్ సిసి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో వర్క్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా రోడ్డు పనులను ప్రారంభించినందుకు పట్టణ మైనారిటీ శాఖ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బిరుదుల సత్యనారాయణ, 13వ వార్డు అధ్యక్షుడు సయ్యద్ హాజీ, సయ్యద్ హఫీజ్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనుల పరిశీలన

వేమనపల్లి, ఏప్రిల్ 11, ప్రభాతవార్త

మండలంలోని నాగారం, జిల్లెడ గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శనివారం ఎంపిడిఓ కుమారస్వామి పరిశీలించారు. ఫారం పండ్, ఫిష్ పండ్ నిర్మాణ పనులు పరిశీలించి, మాస్టర్ రోల్ కాల్ చేసి కూలీల హాజరు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క కూలి పూర్తి పని దినాలను సద్వినియోగం చేసుకోవాలి, వేజ్ రేట్ రూ.307 వచ్చుటకు రోజువారీగా వస్తున్న వేతనాలు చేయవలసిన కొలతల గురించి తెలియజేశారు. అదేవిధంగా ప్రతి ఒక్కరికి పని కల్పించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ మహేశ్వర్ రెడ్డి, ఈసీ మధుకర్, టిఎ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.





## కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ సమావేశం

**సారంగాపూర్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బూత్ లెవెల్ పర్యటన కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకుడు ప్రొద్దుటూరి సతీష్ రెడ్డికి పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. నిర్మల్ జిల్లా యువజన కాంగ్రెస్ కార్యదర్శి ముడికే మల్లేష్ యాదవ్, జిల్లా ఆర్టీఏ మెంబర్ తుమ్మల మల్లేష్ యాదవ్‌లు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రజల సమస్యల పరిష్కారానికి కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతానికి యువత కీలక పాత్ర పోషించాలని కోరారు. భవిష్యత్ కార్యాచరణ, స్థానిక అభివృద్ధి పనులపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొల్లోజు నర్సయ్య, మార్కెట్ చైర్మన్ అబ్దుల్ హాది, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అట్లా పోతారెడ్డి, ఆలయ చైర్మన్ భోజగౌడ్, డైరెక్టర్ పోతారెడ్డి, రాజ్ మహమ్మద్, సర్పంచులు భూమన్న, సాయన్న, నవీన్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ సురేందర్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



## మొక్కజొన్న రైతులకు మద్దతుగా ప్రజా ప్రభుత్వం: క్వింటాలుకు రూ.2400

**నిర్మల్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:**

రబీ సీజన్‌లో రైతులు పండించిన మొక్కజొన్న పంటకు మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి శనివారం మార్కెట్ యార్డులో రైతులకు టోకెన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి కూచాడి శ్రీహరి రావు విజ్ఞప్తి మేరకు వ్యవసాయ శాఖ మంత్రి సానుకూలంగా స్పందించి నిర్మల్, సారంగాపూర్ మార్కెట్లలో కొనుగోలు కేంద్రాలను మంజూరు చేశారని తెలిపారు. క్వింటాలు మొక్కజొన్నకు రూ. 2,400 మద్దతు ధర ప్రకటించినట్లు పేర్కొన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోకుండా ప్రభుత్వ కేంద్రాల్లోనే పంటను అమ్ముకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, రైతులకు అండగా నిలిచేందుకే ఈ చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## జన్నారం నూతన ఎస్సైగా ఉదయ్ కిరణ్ బాధ్యతల స్వీకరణ

**జన్నారం, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**



జన్నారం పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా ఉదయ్ కిరణ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ ఎస్సైగా విధులు నిర్వహించిన గొల్లపల్లి అనూష బదిలీపై వెళ్లడంతో ఆమె స్థానంలో ఉదయ్ కిరణ్ నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్సై ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ, జన్నారం మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణే నా ప్రధాన ధ్యేయం అని ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ మెరుగైన పోలీసు సేవలు అందిస్తాను. ఫిర్యాదులను వెంటనే స్వీకరించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం అని తెలిపారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ప్రజలు ఏ సమయంలోనైనా తమ సమస్యలను తీసుకురావచ్చని సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది నూతన ఎస్సై ఉదయ్ కిరణ్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

# విద్య ద్వారానే సామాజిక సమానత్వం సాధ్యం

**- బిఆర్ఎస్ నస్పూర్ పట్టణ అధ్యక్షుడు అక్కురి సుబ్బన్న**

**నస్పూర్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**



మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకల్లో నివాళులర్పిస్తున్న అక్కురి సుబ్బన్న, ఇతర నాయకులు

విద్య ద్వారానే సమాజంలో సామాజిక సమానత్వం సాధ్యమవుతుందని బిఆర్ఎస్ నస్పూర్ పట్టణ అధ్యక్షుడు అక్కురి సుబ్బన్న పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను శనివారం నస్పూర్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బన్న మాట్లాడుతూ మహనీయ సామాజిక సంస్కర్త జ్యోతిరావు పూలే సమాజంలో ఉన్న అసమానతలు, అణచివేతలపై అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు. దళితులు, మహిళల అభ్యున్నతి కోసం ఆయన తన జీవితాన్ని అంకితం చేశారని వివరించారు. పూలే ప్రారంభించిన విద్యా ఉద్యమం నేటికీ ఎందరికో స్ఫూర్తినిస్తోందని తెలిపారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ సామాజిక న్యాయం, సౌభ్రాతృత్వం ఉన్న సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని సుబ్బన్న పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో పట్టణ కార్యదర్శి మేరుగు పవన్ కుమార్, టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సురేందర్ రెడ్డి, కార్పొరేటర్ గుమ్మడి శ్రీనివాస్, శ్రీరాంపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ బండి రమేష్, నాయకులు వంగ తిరుపతి, పి. జనార్ధన్, ఆకునూరు సంపత్, రుకుం తిరుమల్, కాటం రాజు, దగ్గుల మధు, కందుల ప్రశాంత్, మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## సమాజ సంస్కరణలకు పూలే గారి కృషి ఆదర్శం

**- డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి**

**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త :**

సమాజ సంస్కరణలకు పూలే గారి కృషి ఆదర్శమని కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి అన్నారు. శనివారం సామాజిక విప్లవకారుడు, సంఘ సంస్కర్త, సమాజ సేవకుడు మహాత్మ జ్యోతిబా పూలే 199వ జయంతి వేడుకలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చింతగూడలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీదేవి మాట్లాడుతూ సమాజంలో ఉన్న మూఢనమ్మకాలు, అంధవిశ్వాసాలను రూపుమాపేందుకు ప్రజలకు దారిచూపిన మహనీయుడు జ్యోతిబా పూలే అని పేర్కొన్నారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు బడుగు శ్రీనివాస్ మాట్లాడుతూ పూలే కృషి వల్లనే ఈ రోజు మహిళలు విద్యను అభ్యసించి అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల అధ్యాపకులు లక్ష్మీ నరసింహ, దుర్గం జనార్ధన్, మహేష్, పాఠశాల ఉపాధ్యాయులు గులాబ్ రావు, మోహన్, పండరీనాథ్, రజిత, సంతోషి రేఖ, శారద, శ్రీలత, ఫహీమున్నిస తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులపై ఎంపీడీవో పర్యవేక్షణ

**పెంచికల్ పేట్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త :**

మండల పరిధిలోని చెడ్వాయి పోతపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శనివారం ఎంపీడీవో మహేందర్ రెడ్డి పరిశీలించారు. పనుల పురోగతిని సమీక్షించిన ఆయన, జాబ్ కార్డు కలిగిన ప్రతికూలి తప్పనిసరిగా పనులకు హాజరయ్యేలా పర్యవేక్షణ చేయాలని క్షేత్ర సహాయకులకు సూచించారు. పనులు కొలతల ప్రకారం పూర్తి చేసి గిట్టుబాటు కూలి పొందేలా కూలీలు శ్రద్ధ వహించాలని తెలిపారు. పనుల్లో నాణ్యత,పారదర్శకత పాటించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సతీష్, కార్యదర్శులు రాకేష్, మధుకర్, ఫీల్డ్ అసిస్టెంట్లు మాధవ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో మహేందర్‌రెడ్డి



## మహిళ ఉపాధ్యాయురాలిపై దాడి చేసిన మహిళపై కేసు నమోదు

**దహెగాం, ఏప్రిల్ 11,ప్రభాతవార్త :**

మండలంలోని భామనగర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు కె స్రవంతి పై భామనగర్ గ్రామానికి చెందిన దుర్గం సరోజ అనే మహిళ దాడి చేయడంతో ఆమె పై కేసు నమోదు చేసినట్లు ఎస్ ఐ సి హెచ్ రమేష్ తెలిపారు. ఎస్ ఐ కథనం ప్రకారం శనివారం ఉపాధ్యాయురాలు విధులకు హాజరవడానికి సహా ఉపాధ్యాయుడు తిరుపతి ద్విచక్ర వాహనం పై పాఠశాలకు చేరుకోగా అక్కడే ఉన్న సరోజ ఉపాధ్యాయురాలిపై దుర్భాషలాడుతూ దాడి చేసిందని తెలిపారు. ఉపాధ్యాయురాలు కె స్రవంతి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు అయన తెలిపారు.

## అంబలి పంపిణీ

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త :**

వేసవి కాలం నేపథ్యంలో యుబీవై ఫౌండేషన్ నిర్వాహకులు అంబలి పంపిణీ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ చౌక్ వద్ద యుబీవై ఫౌండేషన్ నిర్వాహకులు ప్రజలకు అంబలి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అధ్యక్షుడు ఉబెద్ బిన్ యహియా మాట్లాడుతూ పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి వచ్చే ప్రజలు తీవ్రమైన ఎండలు ఉన్న దృష్ట్యా ఎండ తాకిడికి గురికాకుండా శరీరం చల్లబడడం కోసం అంబలి ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జ్ అజ్మీరా శ్యామ్ నాయక్, అబ్దుల్ల బాహెతం, మెహెరాజ్, ఓమర్ తదితరులు పాల్గొన్నారు.



అంబలి పంపిణీ చేస్తున్న యుబీవై నిర్వాహకులు తారీక్

# మట్టి అక్రమ రవాణాకు కాంగ్రెస్ పార్టీకి ప్రమేయం లేదు

తాండూర్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త :



మండలంలోని పలు చెరువుల్లో గత కొన్ని రోజులుగా మట్టి అక్రమ తరలింపులో కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి ప్రమేయం లేదని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు గట్టు మురళీధర్ రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎండి ఈసా పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పార్టీకి చెందిన ఒక నాయకుడికి మట్టి అక్రమ రవాణా దందాలో ప్రమేయము ఉంటే, అందరికి ఆపాదించడం సరి కాదన్నారు. మట్టి అక్రమ రవాణా దందాలను తాము ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమన్నారు. మట్టి అక్రమ రవాణా దందా విషయంపై తాము చెరువుల వద్దకు వెళ్లి పరిశీలించడం జరిగిందన్నారు. ఇలాంటి వాటిని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఎప్పుడు సమర్థించడన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఎన్నో సంవత్సరాల అనుభవం ఉందని ఇలాంటి వాటిని కాంగ్రెస్ పార్టీకి ఆపాదించడం సరికాదన్నారు. మట్టి అక్రమ దందా పై సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి తగిన చర్యలు తీసుకునేలా ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. మండలంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసే వివిధ పథకాల్లో లబ్ధిదారులకు పథకాలు అందేలా తమ వంతుగా కృషి చేస్తామన్నారు. లబ్ధిదారుల ఎంపికలో కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఈ సమావేశంలో ఐఎన్టియుసి బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షులు పేరం శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పుట్ట శ్రీనివాస్, జిలుకర శంకర్, దుర్గం మహేందర్, ఐఎన్టీయూసీ నాయకులు మసాడి నారాయణ, భాస్కర చారి, తదితరులు పాల్గొన్నారు

### కేజీబీవీ జూనియర్ కళాశాలలో

# ఆధునిక ల్యాబ్, తరగతి గదుల ప్రారంభం

బెల్లంపల్లి, ఏప్రిల్ 11, ప్రభాతవార్త



బెల్లంపల్లి మండలంలోని నూతనంగా నిర్మించిన కేజీబీవీ జూనియర్ కళాశాలలో ఆధునిక సదుపాయాలతో కూడిన ల్యాబ్‌తో పాటు తరగతి గదులను బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఘనంగా ప్రారంభించారు. సుమారు రూ.2 కోట్ల 30 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ ల్యాబ్, తరగతి గదులు విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పించనున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కూడా పట్టణ స్థాయి సౌకర్యాలు అందించడం ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఆధునిక పరికరాలతో ఏర్పాటుచేసిన ఈ ల్యాబ్ ద్వారా విద్యార్థులు ప్రాయోగిక జ్ఞానాన్ని పెంపొందించుకుని శాస్త్ర, సాంకేతిక రంగాలలో ముందంజ వేయాలని ఆకాంక్షించారు. అలాగే నూతన తరగతి గదులు విద్యార్థులకు అనుకూలమైన అభ్యాస వాతావరణాన్ని కల్పిస్తాయని తెలిపారు. సంవత్సరం నర క్రితం ఈ భవనానికి తానే భూమిపూజ నిర్వహించానని గుర్తుచేసుకుంటూ, తక్కువ కాలంలోనే నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో కూడా విద్యాసంస్థల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఈఓ, కళాశాల ప్రిన్సిపాల్, సంబంధిత అధికారులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రామచందర్, సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# పట్టుదలతో చదివితేనే ఉన్నత పదవులు దక్కుతాయి

**- బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్**

**- జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన ఏకారి లిఖితకు ఘన సన్మానం**

నస్పూర్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త



పట్టుదలతో చదివితేనే అత్యున్నత పదవులు దక్కుతాయని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ పేర్కొన్నారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీరాంపూర్ అరుణక్కనగర్‌కు చెందిన ఏకారి లి ఖిత ఇటీవల వెలువడిన ఫలితాల్లో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శనివారం విజిత్ కుమార్ నస్పూర్ పట్టణ నాయకులతో కలిసి లిఖిత నివాసానికి వెళ్లారు. ఆమెను శాలువాతో సత్కరించి హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చి పట్టుదలతో శ్రమించి న్యాయశాఖలో ఉన్నత కొలువు సాధించడం జిల్లాకే గర్వకారణమని కొనియాడారు. లిఖిత సాధించిన విజయం స్థానిక యువతకు, విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని విజిత్ కుమార్ అన్నారు. లక్ష్యసాధన కోసం కృషి చేస్తే విజయం తప్పక వరిస్తుందని ఈ విజయం నిరూపించిందని తెలిపారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సుబ్బయ్య, కార్యదర్శి పవన్, మాజీ సర్పంచ్ మల్లెత్తుల రాజేంద్రపాణి, కార్పొరేటర్ గుమ్మడి శ్రీనివాస్, నాయకులు వంగ తిరుపతి, సిద్ధం తిరుపతి, రాజేశ్వర్ రెడ్డి, పెట్టం నరేష్, శ్రవణ్, నాగేష్, సంపత్, రమేష్, అ చల్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# 6వ రోజుకు చేరిన సెక్యూరిటీ గార్డుల ఆందోళన

మందమర్రి, ఏప్రిల్ 11, ప్రభాతవార్త



సింగరేణి ప్రభావిత ప్రాంత యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీలు కేవలం మాటలకే పరిమితమయ్యాయా అంటూ సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం (సిఐటియు) ప్రశ్నించింది. ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల ఆందోళన 6వ రోజుకు చేరగా, కెకె5 గని వద్ద భిక్షాటన చేపట్టి నిరసనను తీవ్రతరం చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ మాట్లాడుతూ, రెండు నెలలుగా 220 కుటుంబాలు ఉపాధి కోల్పోయి ఇబ్బందులు పడుతున్నా సింగరేణి అధికారులు, పాలకులు స్పందించకపోవడం తీవ్ర నిర్లక్ష్యమని విమర్శించారు. సింగరేణి సంస్థ కోసం భూములు కోల్పోయిన ప్రజలకు ఉపాధి కల్పిస్తామని రాజకీయ నాయకులు ఇచ్చిన హామీలు నెరవేరలేదని ఆరోపించారు. అవసరం ఉన్నప్పుడు హామీలు ఇస్తారు, తరువాత మర్చిపోతారు" అని మండిపడ్డారు. ఇప్పటికే ఉన్న చిన్న ఉపాధినే తీసివేయడం ద్వారా 220 కుటుంబాలను రోడ్డున పడేసారని, ఇది సామాజికంగా కూడా తీవ్రమైన ప్రభావం చూపుతుందని అన్నారు. భవిష్యత్తులో ప్రజల వద్దకు వెళ్లి ఏ హామీలు ఇస్తారో పాలకులు ఆలోచించాలన్నారు. ఇప్పటికైనా ఏరియా జీఎం మానవతా దృక్పథంతో స్పందించి, 123 పోస్టులతో కొత్త టెండర్ పిలిచి కార్మికులందరినీ యథావిధిగా విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే సింగరేణిలో ప్రాతినిధ్యం వహిస్తున్న కార్మిక సంఘాలు ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ కూడా ఈ సమస్యపై స్పందించకపోవడం కార్మిక వర్గాన్ని మోసం చేయడమేనని విమర్శించారు. అన్ని కార్మిక సంఘాలు ముందుకు వచ్చి ఈ పోరాటానికి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పీడనపై ధిక్కారస్వరం పూలే జీవితం

మంచిర్యాల, ఏప్రిల్ 11, ప్రభాతవార్త



పీడనపై దిక్కార స్వరం, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, చైతన్య దీప్తి మహాత్మ జ్యోతిబాపూలే 199 జయంతిని శనివారం బీసీ రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక పూలే భవన్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ బీసీ వాదం సాహిత్యం రాజకీయాలుచ అనే అంశం మీద ప్రసిద్ధ సామాజిక విశ్లేషకులు రంగు రాజేశం, ప్రముఖ కవి తోకల రాజేశం ప్రసంగించారు. మంచిర్యాల జిల్లాలో కూడా కవులు రచయితలు ఆయా సందర్భాలకు అనుగుణంగా బేసి స్ఫృహను ప్రదర్శించిన సందర్భాలను ఉదాహరణలతో సహా వివరించారు. జిల్లా సాహితీ రంగంలో బీసీ వాదం బలంగా ఉందని, రాజకీయాల్లో కూడా బీసీలకు సముచితమైన స్థానం కల్పించాలని కోరారు. పూలే జీవితం మనందరికీ ఆదర్శనీయమని వాళ్లు కొనియాడారు. బీసీ రచయితల సమాఖ్య జిల్లా కన్వీనర్ గోపగాని రవీందర్ తో పాటుగా ప్రసిద్ధ రచయితలు, కవులు నాగవర ముత్యం, అల్లాడి శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, గోపగాని రమణశ్రీ, చంద్రమోహన్, ప్రకాష్, ఎస్ కొండయ్య, మల్లయ్య, టి. పోచయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం జ్యోతిరావు పూలే చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు.

# పూర్వ విద్యార్థుల ఆపన్నహస్తం

బెల్లంపల్లి, ఏప్రిల్ 11, ప్రభాతవార్త



బెల్లంపల్లి పట్టణంలోని షంషీర్ నగర్‌కు చెందిన కొల్లూరి శంకర్ కుటుంబానికి శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆపన్నహస్తంగా నిలిచి ఆర్థిక సహాయం అందించారు. అనూహ్యంగా చోటుచేసుకున్న ఈ విషాద ఘటనతో కుటుంబం తీవ్ర దిగ్భ్రాంతికి గురవగా, పూర్వ విద్యార్థులు మానవత్వంతో స్పందించి తమ వంతు సహకారం అందించడం స్థానికంగా ప్రశంసలు అందుకుంటోంది. ఈ నెల 7వ తేదీన బెల్లంపల్లి మండలంలోని తాళ్ల గురిజాల గ్రామపంచాయతీ పరిధిలోని లంబాడి తండా శివారులో ఉన్న చెరువులో స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లిన కొల్లూరి శంకర్ కుమారుడు రాజేష్ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. యువకుడి ఆకస్మిక మృతి కుటుంబాన్ని మాత్రమే కాకుండా స్థానికులను కూడా విషాదంలో ముంచెత్తింది. రాజేష్ మరణంతో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ దుర్ఘటన విషయం తెలుసుకున్న శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల పదవ తరగతి పూర్వ విద్యార్థులు వెంటనే స్పందించి, తమలోతాము విరాళాలు సేకరించి మొత్తం రూ.17,500 సమకూర్చారు. అనంతరం పూర్వ విద్యార్థుల ప్రతినిధులు దామెర విజయ్, ఒడ్డి రాజేశం, వసీమ్ కలిసి శంకర్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పి, సమకూర్చిన నగదును అందజేశారు. పూర్వ విద్యార్థుల ఈ సహాయం ఆర్థిక పరంగా మాత్రమే కాకుండా మానసికంగా కూడా కుటుంబానికి ధైర్యం నింపిందని స్థానికులు పేర్కొన్నారు. ఇలాంటి కష్టకాలంలో ముందుకు వచ్చి సహాయం చేయడం నిజమైన మానవత్వానికి నిదర్శనమని కొనియాడారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు నెలకొనగా, రాజేష్ ఆత్మకు శాంతి చేకూరాలని అందరూ ప్రార్థిస్తున్నారు.